మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# రేపు వనపర్తికి మంత్రి కేటీఆర్..!





ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి. నిరంజన్ రెడ్డి, కలెక్టర్, తేజస్ నంద్ లాల్ పవర్



- రూ.10 కోట్లతో ఐటీ టవర్ నిర్మాణం
- రూ.73.కోట్లతో బైపాస్ రహదారి
- రూ.666 కోట్లతో అభివృద్ధి పనులు
- 29న వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన..ప్రారంభోత్సవానికి వస్తున్న రామన్న
- పాలిటెక్నిక్ కళాశాలలో భారీ బహిరంగ సభ ఏర్పాట్లు చేస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్27, ప్రభాతవార్త :** గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కరువు కాటకాలకు నిలయమైన ఉమ్మడి పాలమూరులో క్రమక్రమంగా విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయి. పరిశ్రమలకు రాచ బాట పడుతున్నది. ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్మించిన ఐటీ టవర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంపెనీలతో కళకళలాడుతుంది. అదే బాటలో వనపర్తి జిల్లా ప్రజలకు చిరస్మరణీయ కానుకగా వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఐటీ హబ్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. రూ.10 కోట్లతో ఐటీ టవర్‌కు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయబోతున్నారు. అదేవిధంగా వనపర్తి నియోజకవర్గంలో సుమారు రూ.666 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. కాగా, ఈ నెల 29న మంత్రి కేటీఆర్ వనపర్తి పర్యటన నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి భారీగా ఏర్పాట్లు చేపడుతున్నారు. పాలిటెక్నిక్‌లో జరిగే భారీ బహిరంగ సభకు ప్రజలను భారీగా తరలించేలా సన్నాహాలు చేస్తున్నారు. రూ.666. 42కోట్లపనులకు మంత్రులు కేటీఆర్, నిరంజన్ రెడ్డి శంకుస్థాపన ప్రారంభోత్సవాలు ఈ నెల 29న మంత్రి కేటీఆర్ వనపర్తి పర్యటన నేపథ్యంలో వనపర్తి నియోజకవర్గం లో మొత్తం రూ.6 66.42 కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. రూ.425 కోట్ల మిషన్ భగీరథ ప్రారంభం, రూ.73 కోట్ల బైపాస్ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. రూ.5.08 కోట్లతో రాజాపేటలో నిర్మించిన 96 డబుల్ బెడ్రూం ఇండ్లు లబ్దిదారులకు అందజేయనున్నారు. రూ.75 లక్షలతో నిర్మించిన ఆచార్య జయశంకర్ పార్క్, కాంస్య విగ్రహం ఆవిష్కరణ చేస్తారు. వనపర్తిలోని నాగవరం శివారులో రూ.2.80 కోట్లతో నిర్మించిన షాదీఖాన ప్రారంభించనున్నారు. రూ.2.75 కోట్లతో నిర్మించే బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాలకు శంకుస్థాపన, నాగవరం వద్ద రూ.1.02 కోట్లతో నిర్మించిన భూసార పరీక్షల కేంద్రం ప్రారంభం చేయనున్నారు. రూ.50 లక్షలతో నిర్మించిన యానిమల్ కేర్ యూనిట్, రూ. కోటితో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డు ప్రారంభం కానుంది. రూ.22 కోట్లతో నిర్మించే వనపర్తి కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల వసతి గృహాలకు శంకుస్థాపన, రాజభవనం పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. జిల్లా కేంద్రంలో రూ.15 కోట్లతో నిర్మించే అంతర్గత రహదారులు, డ్రెయిన్ల పనులకు శంకుస్థాపన, రూ.కోటితో రాజీవ్‌చౌక్‌లో నిర్మించిన సురవరం గ్రంథాలయం, గంజ్ లో రూ.20 కోట్ల సమీకృత మార్కెట్, రూ.5.75 కోట్లతో నిర్మించిన టౌన్ హాల్ ప్రారంభించనున్నారు. పీర్లగుట్టలో రూ.15.50 కోట్లతో నిర్మించిన 294 డబల్ బెడ్రూం ఇండ్లు, రూ.1.25 కోట్లతో నిర్మించిన వైకుంఠధామం ప్రారంభం కానుంది. రూ.48.50 కోట్లతో నిర్మించే పెబ్బేరు రహదారి పనులు, రూ.25. 52 కోట్లతో నిర్మించే జేఎన్ టీయూ హాస్టల్ భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ నెల 29న మొత్తం రూ.666. 42 కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, నిరంజన్ రెడ్డి పాల్గొంటారు. ఐటి హబ్‌గా మారనున్న వనపర్తి వనపర్తి ఇప్పటికే విద్యాపర్తిగా భాసిల్లుతున్నది. రాష్ట్రంలో ఎక్కడాలేని కళాశాలలు ఇక్కడ వెలిశాయి. మంత్రి నిరంజన్ రెడ్డి చొరవతో జిల్లా కేంద్రంలో రూ.10 కోట్ల వ్యయంతో ఐటి హబ్ నిర్మాణానికి మంత్రి. కేటీఆర్ శ్రీకారం చుట్టారు. త్వరలో ఐటీ నిర్మిణానికి బీజం పడితే ఊహించని ఇక్కడి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

**సభ విజయవంతానికి సన్నాహాలు..**

జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగే భారీ బహిరంగ సభ విజయవంతానికి మంత్రి. నిరంజన్ రెడ్డి సన్నాహాలు చేస్తున్నారు. కలెక్టర్ నేతృత్వంలో అధికారుల బృందం కేటీఆర్ పర్యటించే ప్రాంతాలను పరిశీలించి పనులు ప్రారంభించారు. హెలీ ప్యాడు, బహిరంగ సభ వేదికను ఖరారు చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో కనీవిని ఎరుగని రీతిలో కేటీఆర్ సభను నిర్వహించాలని మంత్రి నిరంజన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు జన సమీకరణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో కేటీఆర్ పర్యటన ఆసక్తి రేపుతోంది.



# కేసీఆర్ పాలన ఆరిపోయే దీపం..!!

- కేసీఆర్ ప్రభుత్వాన్ని బొందపెట్టే రోజు దగ్గరలోనే ఉంది..
- భూత్పూర్‌లో బీజేపీ ఎమ్మెల్యే, పార్టీ చేరికల కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్



భూత్పూర్‌లో పీఎం సభాస్థలిని పరిశీలిస్తున్న ఈటెల రాజేందర్

**భూత్పూర్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :** మిడిసి పడుతున్న కేసీఆర్ పాలన ఆరిపోయే దీపమని, కేసీఆర్ ప్రభుత్వాన్ని బొందపెట్టే రోజు అతి దగ్గరలోనే ఉందని బీజేపీ ఎమ్మెల్యే, పార్టీ చేరికల కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ అన్నారు. సీఎం కేసీఆర్ ఆయన కొడుకు కేటీఆర్ ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ప్రధాని నరేంద్రమోడీని నైతిక విలువలు లేకుండా విమర్శించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. బుధవారం ఈటెల భూత్పూర్‌లో వచ్చే నెల ఒకటవ తేదిన జరిగే ప్రధాని నరేంద్రమోడీ బహిరంగ సభాస్థలిని పరిశీలించేందుకు వచ్చిన సందర్భంగా సభాస్థలి వద్ద మీడియా సమావేశంలో ఈటెల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడడానికి కేంద్రంలో బీజేపి సర్కార్ పుణ్యమేనని స్పష్టం చేశారు. బీజేపి సహకారంతో అధికారం చేపట్టిన కేసీఆర్ నేడు నోటికి అడ్డుఅదుపూ లేకుండా మాట్లాడుతున్నాడని విమర్శించారు. మోడీ గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో భారతదేశాన్ని ప్రపంచ పటంలో అగ్రగామిగా నిలిపారని పేర్కొన్నారు. జీ-20దేశాల శిఖరాగ్ర సమావేశాలు సమర్థవంతంగా నిర్వహించి, చంద్రయాన్-3 చంద్రుని దక్షిణ ధ్రువంపైకి పంపి భారత విజయపతాకాన్ని ఎగురవేయింపజేసిన ఘనుడు, మహామేధావి ప్రధాని నరేంద్ర మోడీ అని పేర్కొన్నారు. విశ్వగురుగా ప్రపంచదేశాలచే సెహబాస్ అని పించుకున్న దేశనేతను పట్టుకుని సీఎం కేసీఆర్ ఆయన తనయుడు కేటీఆర్ నోటికి ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం వారి కుటుంబ అహంకారాన్ని తెల్పుతుందని అన్నారు. ప్రధాని పాలమూరుకు ఏం చేశాడని వస్తున్నాడని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అన్ని రంగాలలో - మిగతా2లో..

## కాంగ్రెస్‌కు ఓటువేస్తే బిఆర్ఎస్‌కు వేసినట్టే..!

**ఓటమి భయంతో పథకాల పేరుతో పార్టీలోకి చేర్చుకుంటున్న దద్దమ్మలు, బిఆర్ఎస్ నాయకులు**

**కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై బిజెపిలో చేరిక**

**వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన డికె అరుణ**



డికె అరుణ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన దృశ్యం

**గద్వాల ప్రతినిధి, సెప్టెంబరు27 ప్రభాతవార్త:** గద్వాల పట్టణంలోని డికె బంగ్లాలో గట్టు మండల ఇందువాసి గ్రామం, గద్వాల పట్టణానికి చెందిన 30వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ నాయకులు, యువకులు బిజెపి పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారికి బిజెపి జాతీయఉపాధ్యక్షురాలు డికె అరుణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డికె అరుణ మాట్లాడుతూ బిఆర్ఎస్‌నాయకులు ఓటమి భయంతో పథకాల పేరుతో బిఆర్ఎస్ పార్టీలోకి చేర్చుకుంటున్నారని అన్నారు. ఇసుక మాఫియా, భూ కబ్జాలతో ప్రజలను దోచుకుంటున్నారని గద్వాలలో ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మాయమాటలు చెప్పి పార్టీలో చేర్చుకుంటున్నారని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై యువత భారీగా బిజెపి పార్టీలో చేరుతున్నారని అన్నారు. కేంద్రంలో మరోసారి బిజెపి సర్కార్, ఈ సారి తెలంగాణలో బిజెపి ప్రభుత్వం రావడం ఖాయమని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన హామీలు హామీలకే పరిమితమయ్యాయని అన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుందని ప్రతి కార్యకర్త పూర్తి సమయం కేటాయించి విజయంలో పాలుపంచుకోవాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో ఇందువాసి గ్రామం నుంచి కురువ లింగన్న, ఆంజనేయులు, నడిపి బాలప్ప, పెద్దరామన్న, చిన్నరామన్న, పెద్ద హనుమంతు, తుంగ లింగన్న, వీరేష్, పుల్లయ్య, రైలు రామన్న, దొంగ రామన్న, ఎలుక భీమన్న ఉన్నారు. 30వ వార్డు నుండి పార్టీలో చేరిన వారిలో పాల నరేష్, పరుష, కిశోర్, శివ, మణి, శ్రీను, వినోద్, రాహుల్, వీరేందర్, శివసాయి, సాయితేజ, కార్తీక్, ప్రస్న తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కృష్ణారెడ్డి, జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, గట్టు మండల అధ్యక్షుడు శివారెడ్డి, జి. రమేష్, చాకలి నరసింహులు, సంజీవ్, జయరామ్ పాల్గొన్నారు.

### రైతుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న

## కల్వకుంట్ల కుటుంబ పాలన...

- మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షులు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్



అల్లోజి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఈటెల

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** ప్రాజెక్టుల పేరుతో రైతుల నుంచి భూములు తీసుకొని వారికి నష్ట పరిహారం చెల్లించకుండా వారి చావులకు ప్రభుత్వం కారణమవుతోందని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షులు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్వాసిత రైతు ఆత్మహత్యకు కారకులు నేటి బీఆర్ఎస్ పాలకులేనని, ముమ్మాటికి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన హత్యనేనన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో పాలమూరు ప్రాజెక్టు పరిధిలో భూములు కోల్పోయి సరైన పరిహారం అందలేదని, ఆత్మహత్యకు పాల్పడిన రైతు అనంత అల్లోజి కుటుంబాన్ని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షులు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌తో పాటు పలువురు నేతలు పరామర్శించి వారి కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ఈ ప్రాంతం బాగుపడుతుందని గొప్పగా ప్రచారం చేసిన ఈ ప్రభుత్వానికి రైతులు భూములు అప్పగిస్తే వారిని గడ్డి పూస లెక్క భావించి సరైన పరిహారం ఇవ్వకుండా వారి బతుకులను ఈ రాష్ట్ర ప్రభుత్వం చిత్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణం ఈ ప్రజల కోసం జరపడం లేదని, జూరాల పాకాల అనే ప్రాజెక్టును డిజైన్లు పేర్లు మార్చి కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు కొల్లాపూర్ నియోజకవర్గం నార్లాపూర్ వద్ద శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను ఎత్తిపోస్తున్నారని మండిపడ్డారు. స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత ప్రజల సెంటిమెంటుతో కాంట్రాక్టర్లకు మేలు చేసేలా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పేరుతో వేల కోట్లను దోచుకుంటున్నారని, చివరికి పదేళ్ల కాలంలో ఒకే మోటార్‌ను ప్రారంభిస్తూ అంతా నిర్మించినట్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. పాలమూరు ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులు ఆత్మహత్యలకు పాల్పడటంలో మొదటి ముద్దాయి ముఖ్యమంత్రినని ఆయన గుర్తు చేశారు. అల్లోజి కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీజేపీ పార్టీ అండగా ఉంటుందని, హైకోర్టుకు తప్పుడు పత్రాలు సమర్పించిన అధికారులు, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. నిర్వాసిత రైతు కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలన్నారు. రైతు అల్లోజి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో జాతీయ ఓబీసీ మాజీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దిలీప్‌చారి, కొండ మణెమ్మ, నాగేష్, సతీష్ మాదిగ, సుధాకర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, జానకి, అపర్ణరెడ్డి, రాధారెడ్డి, అందె బాబయ్య, శ్రీకాంత్ భీమా తదితరులు ఉన్నారు.

## ప్రజలకు నష్టం కలిగించవద్దు: జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణమ్మ



కంపెనీని సందర్శించిన జడ్పీ చైర్‌పర్సన్

**చిన్నచింతకుంట, సెప్టెంబరు27 ప్రభాతవార్త:** ప్రజలకు నష్టం కలిగించకుండా ఇథనాల్ కంపెనీ యాజమాన్యం జాగ్రత్తలు తీసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూరు గ్రామం వద్ద ఇథనాల్ కంపెనీని ఆమె సందర్శించి ప్రొడక్షన్ మేనేజర్ ఓబుల్‌రెడ్డితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంపెనీనుంచి వ్యర్థాలు రాకుండా చూడాలన్నారు. రెండు రోజుల క్రితం కొద్దిపాటి వ్యర్థాలు బయటికి వచ్చాయని అలా రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ప్రొడక్షన్ మేనేజర్ జడ్పీ ఛైర్మన్‌కు వివరించారు. కంపెనీ నుంచి వ్యర్థాలు బయటికి వస్తే తాగునీటి జలాలు కలుషితమై పర్యావరణానికి ముప్పు, జీవరాసులు చనిపోతాయని అలాగే ప్రజలు రోగాల బారిన పడతారని అలాకాకుండా - మిగతా2లో..

# సీమాంధ్ర నాయకులను మించి దోపిడీ..!

- అభివృద్ధి మాటున బీఆర్ఎస్ అరాచక పాలన
- రాజకీయ పునరేకీకరణ జరగాలి
- మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి
- ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు:డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి, వేదికపై జి మధుసూదన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :** బీఆర్ఎస్‌ది సీమాంధ్ర నాయకులకు మించి దోపిడీ పాలన అందిస్తున్నారని అరాచక పాలనను అంతం చేయడానికి తెలంగాణ కోసం ప్రజల కోసం రాజకీయ పునరేకీకరణ జరగాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ సమయంలో విద్యార్థుల బలిదానాలు, చూసి చలించి ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా, ఆంధ్రాలో అధికారం కోల్పోతామని తెలిసినా సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కానీ ఏ ఆశయాలకోసం అయితే తెలంగాణ ఏర్పడిందో ఆ ఆశయాలు నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణను మొత్తం నాశనం చేస్తున్నారని చెప్పారు. రాక్షకుడే భక్షకుడిడా మారుతున్నారని ఎవరికీ చెప్పు కోవాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో ప్రజలు బిక్కు బిక్కుమంటూ బతుకుతున్నారని ఎవరికీ ఎప్పుడు ఆ రెవెన్యు అధికారి నుంచి ఏ పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్ వస్తుందో తెలియక భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. 2004 సునామి వచ్చి టీడీపీ గల్లంతైనట్లే ప్రస్తుతం తెలంగాణలో కూడా అదే జరుగుతుందని, ఊహించని రీతిలో పరిణామాలు చోటుచేసుకుంటాయన్నారు. బీజేపీ బీఆర్ఎస్ నుంచి భారీ స్థాయిలో కాంగ్రెస్‌లోకి వలసలు ఉంటాయని జోష్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యమయ్యే హామీలను ఇస్తుందని, వాటిని తప్పక అమలు చేస్తుందన్నారు. గతంలో రుణమాఫీ, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇండ్లు అన్ని చెప్పినట్లుగాలే అమలు చేసిందన్నారు. బీఆర్ఎస్ మాత్రం సాధ్యం కానీ హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెడుతుందన్నారు. తెలంగాణలో ఇప్పటికీ 35వేల డబుల్ ఇండ్లు అందజేయలేదని కాంగ్రెస్ హయాంలో 30లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినట్లు చెప్పారు. కర్ణాటకలో కూడా అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచితంగా ఆర్టీసీ ప్రయాణం లాంటి పథకాలను అమలు చేసిందన్నారు. తెలంగాణలో కూడా ఇటీవలే సోనియా గాంధీ ఆరు పథకాలను ప్రకటించారని వాటిని తప్పకఅమలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వస్తుందని, మహబూబ్‌నగర్‌లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలవాలన్నారు. అంతకముందు డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ప్రశ్నించే గొంతులను అణివేసే దోరణి కొనసాగుతుందని, ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్‌ది అరాచక అవినీతి పాలన అన్నారు. తెలంగాణ ఆశయం యువకుల ఆశలు నెరవేరాలంటే కాంగ్రెస్ రావాలన్నారు. కార్యక్రమంలో నేతలు వినోద్, రాధాఅమర్, బురుజుసుధాకర్‌రెడ్డి, బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల బాంధవుడు సీఎం కేసీఆర్...



పాదయాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి పేద ప్రజల బాంధవుడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలిచారని, తెలంగాణ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల రైతుల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం 14వ రోజు పదేళ్ల ప్రజా ప్రస్థాన పాదయాత్రలో భాగంగా తిమ్మాజిపేట మండలంలోని ఆర్.సీ.తాండ, హనుమాన్‌తాండ, ఇప్పలపల్లి, మాన్యనాయక్ తాండా, హెమ్లనాయక్ తాండ, మరికల్ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి పలుఅభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో అన్ని వర్గాల అభివృద్ధికి ఎన్నో రకాల సంక్షేమ కార్యక్రమాలను ఏర్పాటు చేశారని, 24 గంటల విద్యుత్, రైతు బంధు, రైతు భీమా, కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ ఆసరా పెన్షన్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి, కేసీఆర్ కిట్ లాంటి ఎన్నో సంక్షేమాలను అందించిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో రైతులకు చేయనటువంటి అభివృద్ధిని తెలంగాణ రాష్ట్రం అందించిందన్నారు. రైతుల అభివృద్ధి కోసం నూతన వ్యవసాయ పద్దతుల పంటల మార్పిడి కోసం రూ.5వేల జనాభాకు రూ.30లక్షల వ్యయంతో రైతు వేధికలను ఏర్పాటు చేశారని, రైతులను పేద ప్రజలను మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ముందుసుక్తొస్తుందన్నారు. ఎంజెఆర్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టానని, నియోజకవర్గ వ్యాప్తంగా 12వేల మందికి ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు అందించానన్నారు. పేద ప్రజల కడుపు నింపేందుకు కేవలం రూ.5లకే మర్రన్న క్యాంటీన్‌ను ప్రారంభించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల భవనాల నిర్మాణాలను చేపట్టామని, వికలాంగులకు కృత్రిమ అవయవాలు, పేద ఆడబిడ్డలకు సామూహిక వివాహాలు, యువకులకు ఆటల పోటీలు నిర్వహించారు. పాదయాత్రలో మహిళలు బోనాలతో ఘన స్వాగతం పలికారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి భైకాని శ్రీనివాస్ యాదవ్, ప్రజా ప్రతినిధులు, గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# భవిష్యత్తు తరాలకు కాంగ్రెస్ పార్టీ భరోసా...

- చాకలి గుడిసెల్లో కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణ..
- పార్టీల్లో చేరికలు
- డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



వంశీకృష్ణ సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

**వంగూరు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** కాంగ్రెస్ అధిష్టానం వరంగల్‌లో రైతు డిక్లరేషన్, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్, చేవళ్లలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్లతో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు తరాలకు భరోసాను కలిప్తుందని డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం వంగూరు మండలంలోని చాకలి గుడిసెల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజల జీవన విధానంలో మార్పు వస్తుందని, రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం అచ్చంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పండిత్‌రావు, మాజీ మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ రాజేందర్, ఉప్పునుంతల మండల అధ్యక్షులు కట్ట అనంతరెడ్డి, వెల్టూరు సర్పంచ్ రంగారెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు వెంకటయ్య, జంగయ్య, శ్రీశైలం, సైదులు, సాయికృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి..



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

**గద్వాల ప్రతినిధి, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమ కారకులు, స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా ఐడిఓసిలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా, తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. వారి సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్, బిసి సంక్షేమ అధికారి శ్వేత ప్రియదర్శిని, జిల్లా అధికారులు, ఏఓ భద్రతప్ప, పద్మశాలి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి..

- జోన్ 7 జోగులాంబ డిఐజి ఎల్ఎస్ చౌహాన్
- 5 జిల్లాల ఎస్పీలతో సరిహద్దు సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి ఎల్ఎస్ చౌహాన్

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** సరిహద్దు ప్రాంతాల్లో వచ్చే దారిపోయే దారిలో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని జోన్ 7 జోగులాంబ డిఐజి ఎల్.ఎస్ చౌహాన్ ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే శాసనసభ ఎన్నికల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒక ప్రత్యేక ప్రణాళికను రూపొందించడానికి సరిహద్దు సమావేశాన్ని అడ్డాకుల పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డిఐజి మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల్లో ప్రవేశము, నిష్క్రమణ మార్గాలలో 24/7 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీ తనిఖీలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, గంజాయి, ఇతర మాదకద్రవ్య వ్యాపారాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవడం, సరిహద్దు ప్రాంతాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల సమయంలో మద్యం, నగదు సరఫరా నియంత్రణ కొరకు చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు. సరిహద్దులలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు పరస్పర సమాచార వ్యవస్థను సమన్వయంతో సాఫీగా ఎన్నికలు సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులు రోడ్డు ప్రమాదాలు, మిస్సింగ్ కేసులు, (దొంగతనాలు) క్రైమ్‌కి సంబంధించి కేసుల సమాచారాన్ని ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకోవాలని డిఐజి తెలిపారు. అన్ని జిల్లాల అధికారులు కలిసి ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సంబంధిత పోలీసు అధికారులు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సరిహద్దు సమావేశము నందు వనపర్తి ఎస్పీ రక్షితా కె మూర్తి ఐపిఎస్, మహబూబ్‌నగర్ ఎస్పీ కె. నరసింహ, నాగర్‌కర్నూల్ ఎస్పీ మనోహర్, నారాయణపేట ఎస్పీ వెంకటేశ్వర్లు, జోగులాంబ గద్వాల ఎస్పీ సృజన పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి..

**నారాయణపేట ప్రతినిధి, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జెఏసి సంఘాలు ఇచ్చిన రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె పిలుపులో భాగంగా బుధవారం మండల కేంద్రంలో అంగన్‌వాడిలు చేస్తున్న 17వ రోజు సమ్మె రిలే నిరాహార దీక్షలో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొని వారిని ఉద్దేశించి మాట్లాడారు. సిఐటియ జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్‌రాజ్ గత 48 సంవత్సరాల నుండి ఐసిడిఎస్‌లో తెలంగాణ రాష్ట్రంలో 70 వేల మంది అంగన్‌వాడి ఉద్యోగులు చాలీ చాలని వేతనాలు తీసుకుంటూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. వీరందరిని షరతులు లేకుండా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గోవింద్‌రాజ్ ప్రసన్న, శివకుమారి, ఆశమ్మ, మంజుల, అంగన్‌వాడీలు డి. విజయలక్ష్మి, మంజుల,గిరిజ, జమున, విజయలక్ష్మి, సుశీల, భారతమ్మ, లక్ష్మీదేవి, సునంద, కళావతి, అనిత, సునీత నర్సింగమ్మ, సుజాత, అనిత, అనురాధ, రాజేశ్వరి, రాధిక, ఎన్. భాగ్యలక్ష్మి, సునిత, గిరిజ,బేగం, వెంకటమ్మ, ఉమాదేవి, మణెమ్మ, శ్రీలత, తిరుపతమ్మ, ప్రమీల, పద్మ, విజయలక్ష్మిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## పరిసరాల పరిశుభ్రతకై స్వచ్ఛతాహి సేవ..

**కొల్లాపూర్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుద్ధ్య సిబ్బంది అందరికి వైద్య పరీక్షలు చేయాలని మున్సిపల్ ఛైర్మన్ ఆర్. విజయలక్ష్మి చంద్రశేఖరాచారి, కమిషనర్ ఎస్. రాజయ్య ఆదేశాల మేరకు బుధవారం కొల్లాపూర్ మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వారికి డాక్టర్లు సూచనలు, సలహాలు అందించారు. అవసరమైన మందులను పంపిణీ చేశారు. పట్టణంలో ఈదమ్మ నర్సరీ దగ్గర పాఠశాల విద్యార్థులకు వ్యర్థ చెత్త సేకరణతో కంపోస్టు ఎరువు తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. పాడైపోయిన కూరగాయలు, రోడ్డుపై రాలిన ఆకులతో కంపోస్టు ఎరువు తయారు చేయడం ఆ తర్వాత ఎరువును మొక్కల పెంపకానికి ఉపయోగించడం మొదలైన వాటి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ జమీర్‌పాషా, మున్సిపల్ అధికారులు, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## జనం నుంచి జలంలోకి గణనాథులు..

**గిరిజన తండాలలో ఘనంగా గణేష్ నిమజ్జనం**

**కోయిల్‌కొండ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** మండలంలో మోదీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల ముందలితండా, వెనికి తండాలలో బుధవారం ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందలి తండాలో గోవిందునాయక్ నేతృత్వంలో తండా గిరిజనులు, యువకులు ముందుకువచ్చి నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. జైపాల్‌నాయక్ రూ.51,000కి పాటపాడి లడ్డు వేలంను దక్కించుకున్నాడు. నిమజ్జనోత్సవ కార్యక్రమంలో తండాకు చెందిన రాజు, సురేష్, శ్రీధర్, గణేష్, సంజు, తారాసింగ్, పాండు, శ్రీను, నెహ్రూ ఉన్నారు. వెనికితండాలో నీలేష్‌నా యక్ ఆధ్వర్యంలో శోభాయమానంగా తీర్చిదిద్దిన రథయాత్రలో వినాయకుని ప్రతిష్టించి తండాకు చెందిన గిరిజనులు, యువకులు నృత్యాలు చేయగా సాంప్రదా బద్ధంగా మహిళలు ఆడిపాడారు. తండా వాసులతో ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి వినాయక ఉత్సవాల్లో పాల్గొనడంతో తండాలో పండగ వాతావరణం నెలకొంది. గణేష్ నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా కొనసాగింది. కార్యక్రమంలో జగన్, నగేష్, గబ్బర్, గణేష్, సురేష్, నితిన్,శివరాం, రాజు, కృష్ణ, గోపాల్, రాము పాల్గొన్నారు.



## సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం..

**అచ్చంపేట, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మెప్మా, ఆర్పీలకు వేతనాలు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా, ఆర్పీలు ఎమ్మెల్యేను కలిసి వారికి పుష్పగుచ్చం అందించి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ మున్సిపల్‌లో పనిచేస్తున్న ఆర్పీలను గుర్తించి వేతనాలు పెంచడం పట్ల సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ శాంతకుమారి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు పోకల మనోహర్, మున్సిపల్ ఛైర్మన్ నర్సింహ్మగౌడ్, వైస్ ఛైర్ పర్సన్ అరుణ తదితరులు ఉన్నారు.



## వాసునగర్ వినాయక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

**నారాయణపేట ప్రతినిధి, సెప్టెంబరు 27 ప్రభాతవార్త** : మక్తల్ నియోజకవర్గం కృష్ణా మండల పరిధిలోని గుడెబల్లూరు గ్రామంలో లంబోదరుడిని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దర్శించుకుని పూజలు నిర్వహించారు. వారి వెంట మండల అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, కృష్ణ మండల వైస్ ఎంపిపి ఈశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా దేవతామూర్తుల బ్రహ్మోత్సవాలు

**చిన్నచింతకుంట, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** మండల పరిధిలోని లాల్‌కోట గ్రామంలో శ్రీ ఆంజనేయ, ఈశ్వర, వెంకటేశ్వర దేవతా మూర్తుల ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా భాద్రపద మాస శుక్లపక్షం పౌర్ణమి రోజున దేవతామూర్తుల తీర్థావళి ఉత్సవాలు జరుగుతాయి. ఈ తీర్థావళి ఉత్సవాలలో భాగంగా మొదటిరోజు బిందెసేవ ఉత్సవం నిర్వహించారు. దేవతామూర్తుల వెండి ఆభరణాలను గ్రామ పురవీధులగుండా శోభయాత్ర నిర్వహించి శ్రీఆంజనేయ, ఈశ్వర, వెంకటేశ్వరస్వామి వార్ల ఆలయాలలో వెండి ఆభరణాలను అలంకరించారు. గురువారం అఖండ భజనలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. తెల్లవారామున శ్రీ ఆంజనేయస్వామి రథోత్సవం, నందికోళ్లసేవ, శ్రీశివాలయం ముందు అగ్నిగుండం తీర్థావళిలో ప్రధానఘట్టాలు ఈపూజా కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటారు. 29న తీర్థావళితో ఉత్స వాలు పరిసమాప్తి అవుతాయని భజన మండలి సభ్యులు తెలిపారు. ఈఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు భారీగా తరలివస్తారు. భక్తులకు మూడురోజులపాటు అఖండభజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు.



## ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

**అడ్డాకుల, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** అడ్డాకుల మండల కేంద్రంలోని ఆశ వర్కర్లు చేస్తున్న సమ్మెకు అడ్డాకుల మండల కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా ఆశా వర్కర్లు చాలీ చాలని వేతనాలతో జీవనం గడుపుతున్నారు. అంతేకాదు కరోనా సమయంలో వారి సేవలు అమోఘం. కరోనా సమయంలో సమాజంలో ఏ వర్గం చేయని సాహసం ఆశా వర్కర్లు చేశారు. వారి న్యాయమైన కోరికలు అయిన 18 వేల వేతనంతో పాటు వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ కరోనా సమయంలో కేంద్రం వారి సేవలను గుర్తించి వారికి ప్రతినెలా బోనస్ రూపకంగా ఇచ్చిన వెయ్యి రూపాయలు గత 16 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం తమ ఖజానా లో జమ చేసుకుంటుందన్నారు. ఇది చాలా అన్యాయమని వారికి అనారోగ్య సమస్యలు వచ్చిన పుడు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని మండల కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షఫిఅహ్మద్, అడ్డాకుల మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గోవుల బాలరాజు, మండల ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్‌రెడ్డి, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పరుశరాములు, సోషల్ మీడియా కన్వీనర్ ప్రేమ్‌కుమార్, వార్డు మెంబర్ సాయిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు నవీన్‌చారి, నిరంజన్‌గోరి, మోహన్ పాల్గొన్నారు.



# ప్రజల మనిషి గువ్వల..!

- ఆది నుంచి బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగింపు...
- సీఎం కేసీఆర్ మానస పుత్రుడుగా ప్రభుత్వ విప్, గువ్వల బాలరాజుకు ప్రత్యేక గుర్తింపు...



**అచ్చంపేట, సెప్టెంబర్27 ప్రభాతవార్త:** మలిదశ తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర అధినేత సీఎం కేసీఆర్ అడుగుల్లో అడుగు వేసి రాష్ట్ర సాధనే ధ్యేయంగా పల్లె పల్లెలో తెలంగాణ నినాదాన్ని వినిపించేందుకు రాత్రి, పగలు తేడా లేకుండా అహర్నిశలు కృషి చేశారు. అనాటి ఆంధ్రా వలస పాలకుల పాలనలో ఉద్యమాలు చేస్తున్న విద్యార్థులు, యువకులపై లాఠీ చార్జీలు చేయించి ఆత్మబలిదానాలకు కారణమైన ప్రభుత్వంపై విరుచుకుపడి తనదైన శైలిలో రాష్ట్ర ఏర్పాటే ధ్యేయంగా కేసీఆంకు నమ్మినబంటుగా ఉంటూ నమ్మిన ప్రజలకు నేనున్నాననే భరోసాను కల్పిస్తూ ఉద్యమానికి ఊపిరి పోశారు. ఆంధ్రా వలస పాలకుల పాలనలో ఎందరో అమరులైన రాష్ట్రం ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ఆ నాటి పాలకులపై తిరుగుబాటుకు తన నియోజకవర్గంతోపాటు ఉమ్మడి పాలమూరుజిల్లాలో ప్రజలనంతా ఏకం చేసి ముందుకు సాగి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమం నుంచి నేటి వరకు నేనున్నాననే భరోసా కల్పిస్తే ఆకుటుంబానికి, ఆవ్యక్తులకు పూర్తి స్థాయిలో అండగా ఉంటూ వారి అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడుతున్న వ్యక్తి గువ్వల బాలరాజు.

**రాజకీయ ఆరగ్రేటం...**

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. 2007 అక్టోబర్ 16న వనపర్తి బహిరంగ సభలో తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. 2007నుంచి 2009వరకు టీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. 2009లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. 2009 నుంచి 2014 వరకు అచ్చంపేట టీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జిగా పనిచేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అచ్చంపేట నియోజకవర్గం నుంచి అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించడంతో భీఫాం తీసుకొని వంగూరు మండల కేంద్రంలోని శ్రీ గెల్వాలాంబ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిక్కుడు వంశీకృష్ణపై విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణపై 9400ల పై చిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2019 సెప్టెంబర్ 07న అసెంబ్లీలో ప్రభుత్వ విప్‌గా నియమితులై కొనసాగుతున్నారు. 2022 జనవరి 26న బీఆర్ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులుగా నియమితులై కొనసాగుతున్నారు. సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌పార్టీకి విధేయుడిగా వ్యవహరించడం, ఆటల్లో రాణించడం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత చదువుల్లో నిరంతరం అభ్యసించడం, పార్టీ, సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేస్తే వారిని ధీటుగా ఎదుర్కొని నిలబడుతున్నారు.

**సాధించిన విజయాలు...**

అచ్చంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, అచ్చం పేట నియోజకవర్గంలో 90 కొత్త గ్రామ పంచా యతీల ఏర్పాటు. నియోజకవర్గంలో తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. అచ్చంపేట నల్లమల్ల ప్రాంతంలో ప్రజలు అనారోగ్య భారిన పడి ధీన అవస్థ పడుతున్నారని ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటుచేయించేందుకు సీఎం కేసీఆర్‌తో కొట్లాడి సాధించి వైద్యఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావుతో 2023లో ప్రారంభించారు. అచ్చంపేట ప్రాంతానికి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టేందుకు సీఎం కేసీఆర్‌తో అను మతులు తీసుకొచ్చారు. మొదటి సారి అచ్చం పేట మునిసిపల్ ఎన్నికల్లో 20కి 20 సీట్లు సాధించి ప్రతిపక్షాలను గల్లంతు చేసి బీఆర్ఎస్‌కు అచ్చంపేటలో ఎదురులేదని నిరూపించారు. నియోజకవర్గంలో 90శాతం గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేయించి నిర్మించారు. పట్టణంలోని లింగాల చౌరస్తాలో ప్రధాన రోడ్డును వెడల్పు చేయడం, నిరంతరం ప్రజల మధ్యలోనే ఉంటూ ప్రజలకు ఇచ్చిన మాటను తూచ తప్పకుండా నేరవేర్చి ప్రజల వ్యక్తిగా ప్రజల మన్ననలు పొందుతున్నారు. ముక్కుసాటిగా వ్యవహరించడం, పేద ప్రజల సమస్యల పట్ల సామాజిక కోణంలో ఆలోచించడం, ఎంత పెద్ద సమస్య అయిన ధైర్యంగా నిలబడి పరిష్కరించే తత్వం, ప్రజల సమస్యలను నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే తత్వం. ప్రతిపక్షాలకు ధీటుగా సమాధానమివ్వడంలో రాకెట్ స్పీడ్‌తో సాధించే తత్వం.

**పేరు :-** గువ్వల బాలరాజు
**తల్లిదండ్రులు :-** గువ్వల బక్కమ్మ రాములు
**జీవిత భాగస్వామి :-** గువ్వల అమల
**సంతానం :-** ఇద్దరు కుమారులు
**పుట్టినతేదీ :-** 30/06/1977
**స్వగ్రామం :-** పొలికేపహాడ్, గోపాల్‌పేట మండలం, వనపర్తి జిల్లా.
**కుటుంబ నేపథ్యం :-** వలస కూలీ కుటుంబంలో జన్మించి తన తండ్రితో కలిసి మట్టి పనిచేశారు. చిన్నపాటి నిర్మాణ కాంట్రాక్టర్‌గా ఎదిగి అందులో రాణించి జీబీఆర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అనే కంపెనీని స్థాపంచి ఆర్థికంగా ఎదిగారు.
**విద్యాభ్యాసం :-** వనపర్తిలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని న్యూ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో బీకాం పూర్తి చేశారు. పీఆర్ఆర్ లా కళాశాలలో ఎల్ఎల్‌బి, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో లా విద్యలో లెజిస్లేటివ్ ప్రివిలేజెస్ ఇన్ ఇండియా అండ్ జ్యూడిషయల్ రెసాన్స్‌బుల్ క్రిటికల్ స్టడీపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొం దారు. అంతటితో ఆగకుండా ప్రపంచంలోని పేరుగాంచిన ఇండియన్స్ స్కూల్ ఆఫ్ బిజినేస్ (ఐఎస్‌బీ) కళాశాలలో చేరి ప్రస్తుతం అడ్వాన్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ పాలసీ ఉన్న త కోర్సును



## గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఆడేందుకు కృషి చేస్తా...

**- ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

**అచ్చంపేట, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఆడేందుకు తన వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేర్కొన్నారు. బుధవారం అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ శాంతకుమారితో కలిసి మాట్లాడారు. అచ్చంపేట మండలం చెదురుబావితాండకు చెందిన రాత్లావత్ దినేష్‌నాయక్ అండర్ 19 తెలంగాణ రాష్ట్రానికి ఎంపిక కావడం ఈ ప్రాంతానికి గర్వకారణమన్నారు. భవిష్యత్తులో క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ స్థాయిలో క్రీడా పోటీల్లో ఆడేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. దినేష్‌కు తండ్రి లేకున్న తల్లి కూలి పనులు చేస్తూ ప్రోత్సహించడం ఆ తల్లికి కొడుకుపై ఉన్న ప్రేమ అనంతమైందన్నారు. గ్రామీణ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం వారికి తోడుగా నిలుస్తుందన్నారు. అచ్చంపేట ప్రీమియర్ లీగ్‌కు సంబంధించినటువంటి టోర్నమెంట్ నిర్వహిస్తామని ఆయన వివరించారు. క్రీడాకారుడు దినేష్‌కు కావాల్సిన అన్ని రకాల సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. క్రీడాకారుడు దినేష్‌నాయక్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు మనోహర్, మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ అరుణ్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ తులసీరాంనాయక్, సీనియర్ నాయకులు అమీనోద్దిన్ తదితరులు ఉన్నారు.



క్రీడాకారుడు దినేష్‌నాయక్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

## ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి..

**కోయిల్‌కొండ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల ఆశా వర్కర్ల సంఘం అధ్యక్షురాలు రామేశ్వరి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన కోయిల్‌కొండలోని తహసిల్దార్ కార్యాలయం ముందు గల అంబేద్కర్ విగ్రహం ముందు మండలంలోని ఆశావర్కర్లు నిరవధిక సమ్మె నిర్వహించారు. సమ్మెనుద్దేశించి మాట్లాడుతూ ఆశావర్కర్లకు ఖచ్చితమైన వేతనం రూ.18 వేలు ఇవ్వాలని ఆమె ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఆశా కార్యకర్తలు అందరికి హెల్త్‌కార్డులు ఇచ్చి ప్రమాదభీమా సౌకర్యం రూపాయలు ఐదు లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆమె కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నింటిని ఆశా వర్కర్లకు వర్తింపజేయాలని ఆమె ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించారు. ఎఎన్ఎం, జిఎన్ఎం పోస్టులలో ఆశావర్కర్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించి వెయిటేజ్ మార్కులు నిర్ణయం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలైన ఆశా వర్కర్లు చేస్తున్న నిరవధిక సమ్మెను గుర్తించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ ప్రాంతాలలోని గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, చిన్న పిల్లలకు, ప్రజలకు ఎన్నో సేవలు చేస్తున్న మమ్మల్ని ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం నాయకురాలు రాజేశ్వరి, మంజుల, రమాదేవి, చంద్రకళ, పుష్పలత, గౌతమి, షాలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షురాలు

## నరేంద్రమోదీ బహిరంగ సభను జయప్రదం చేద్దాం..

**బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్**

**వనపర్తి క్రైం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ లో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేద్దామని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1న పాలమూరులో జరిగే భారీ బహిరంగ సభకు వనపర్తి నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లాలని సూచించారు. సభకు ప్రజలను భారీగా తరలించేందుకు జన సమీకరణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పట్టణంలో 33 వార్డులోని 64 బూతుల నుంచి పెద్ద సంఖ్యలో జనాన్ని తరలించి సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు సీతారాములు బిజెపి జిల్లాకార్యదర్శులు బోయిలరామ్మోహన్, చిత్తారి ప్రభాకర్, బీజేవైఎం జిల్లాఅధ్యక్షులు అనుజ్ఞరెడ్డి, దళిత మోర్చా జిల్లాఅధ్యక్షుడు కుమార్, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బాబురావు, బిజెపి నాయకులు ప్రవీణ్, బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి రాజశేఖర్‌గౌడ్, పెద్దపులి కిరణ్, రఘునారాయణ, పట్టణఉపాధ్యక్షులు రఘు, మోహన్, సాగర్, విక్రమ్‌రామ్, బీజేవైఎం పట్టణ ప్రధానకార్యదర్శి రాయన్న సాగర్, నాయకులు విజయ్ సాగర్ చుక్కసతీష్, తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

## అంగన్‌వాడి కేంద్రంలో ఘనంగా పోషణ మాసోత్సవ వేడుకలు..

**అయిజ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉప్పల గ్రామంలో గల అంగన్‌వాడి కేంద్రంలో బుధవారం పోషణ మాసోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఉప్పల సెక్టార్ సూపర్‌వైజర్ తెల్లమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాలలో లభించే పోషకాహార పదార్థాలను బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా అందించాలని వారి ఆరోగ్యాల పట్ల అవగాహన కల్పిస్తూ ఉండాలని అంగన్‌వాడి టీచర్లకు సూచించారు. హాజరైన గర్భిణీ స్త్రీలు, చిన్నారుల తల్లిదండ్రులకు వారు అందించాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడి కేంద్రంలో సామూహిక శ్రీమంతం వేడుకలు నిర్వహించి పోషణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉప్పల సెక్టార్ అంగన్‌వాడి టీచర్లు, ఎఎన్ఎంలు ఆశా వర్కర్లు, గర్భిణీ స్త్రీలు, చిన్నారులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గర్భిణీలకు సీమంతం వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## రావులపల్లెలో చెక్‌డ్యాంను పరిశీలించిన ఎమ్మెల్యే ఆల..!!

**భూత్పూర్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం రావులపల్లెలో పెద్దవాగుపై రు.3కోట్ల 8లక్షలతో నిర్మిస్తున్న చెక్‌డ్యాంను దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఇదేగ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అటెండర్‌గా పనిచేసి పదవీవిరమణ పొందిన నారాయణగౌడ్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పోతులమడుగు గ్రామంలో బొజ్జయ్యకు కృత్రిమ చేయి కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రు. లక్షా 50వేల ఎల్ఓసీ కాపీని అందజేశారు. ఈ కార్యక్రమంలో రావులపల్లె సర్పంచి శ్రీనివాసులు, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మనెమోని సత్యనారాయణ, బోల వెంకట్రాములు, కరివెన ఉప సర్పంచి బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



1.50లక్షల ఎల్ఓసి అందజేస్తున్న ఎమ్మెల్యే



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆల

## కేసీఆర్ పాలన ఆరిపోయే దీపం..!!

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అభివృద్దిని సాధించిన ప్రధాని వేల కిలోమీటర్ల జాతీయ రహదారులను జాతికంకితం చేసేందుకు, జీ-20దేశాల సమిట్, చంద్రమాన్-3 వంటి విజయాలతో ప్రధాని పాలమూరుకు వస్తున్న సంగతి కేసీఆర్ కుటుంబం గుర్తించాలని సూచించారు. ఈటెల రాజేందర్ వెంట బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి ఆచారితో పాటు నాయకులు ఎగ్గని నర్సింహులు, సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంతో ముఖాముఖి..

**ధరూర్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఏఐసిసి అబ్జర్వర్స్ సద్దుగౌడ పాటిల్, కావేరి పర్యవేక్షణలో బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ధరూర్ మండల అనుబంధ సంస్థ నాయకులు, ధరూర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంతో ముఖాముచ చర్చించారు. నియోజకవర్గ ఏఐసిసి అబ్జర్వర్స్ సమక్షంలో ధరూర్ మండల ముఖ్యనాయకులతో ధరూర్ మండల కాంగ్రెస్‌పార్టీ స్థితిగతి గురించి చర్చించారు. కాంగ్రెస్‌పార్టీ విధి విధానాలు, వాటిని ఎలాముందుకు సాగించాలనే విషయంపై రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం ఎలా సాధించాలనే విషయంపై సలహాలు, సూ చనలు గురించి చర్చించారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్, జిల్లా జనరల్ సెక్రెటరీ జమాల్, నరెందర్, శ్రీకాంత్, గోవింద్‌రెడ్డి, ధరూర్ మండల కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ నా యకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## శుభకార్యంలో బీఆర్ఎస్ నేతలు..

**దేవరకద్ర, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల రాజోలిలో జరిగిన శుభకార్యంలో బీఆర్ఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారిని నాయకులు ఆశీర్వదించారు. గ్రామానికి చెందిన గొల్లశ్రీను, మంజుల దంపతుల కూతురు పుట్టుచీర కార్యక్రమంలో బీఆర్ఎస్ తుమ్మలశేఖర్‌రెడ్డి, సర్పంచ్ కృష్ణవేణి రామకృష్ణ, ఉపసర్పంచ్ నాగిరెడ్డి, నరసింహ్మ, సతీష్, వెంకటేశ్, చెన్న య్య పాల్గొన్నారు.



## ఉద్యోగ భద్రత కల్పించాలి..

**వనపర్తి క్రైం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :** స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాసన్న డిమాండ్ చేశారు. స్వీపర్ల చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారానికి 94వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారానికి 94వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించటం ప్రభుత్వ కర్తవ్యమన్నారు. కెసిఆర్ ప్రభుత్వం బాధ్యతను విస్మరిస్తుందని, చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.15 లక్షలు, మరణించిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శోభారాణి, ఖాజా పాషా స్వీపర్లు పాల్గొన్నారు.



## వేలంపాటలో రూ.32,516 పలికిన లడ్డూ

**దేవరకద్ర, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం పుట్టపల్లిలో మంగళవారం రాత్రి నిర్వహించిన వినాయకుడి లడ్డూ వేలంపాటలో లడ్డూ రూ.32,516 ధర పలకింది. వినాయకు డి నిమజ్జనం సందర్భంగా ఈ లడ్డూను వేలం పాట నిర్వ హించారు. గ్రామానికి చెందిన మ్యాదరి సంతోష్ వేలం పాటలో అత్యధికంగా పాటపాడి లడ్డూను కైవసం చేసుకొన్నారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ గణేశ్ ఉత్సవ కమిటి అధ్వర్యంలో తుమ్మల రాంరెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్ రావు, యువ నాయకుడు చెన్నకేశవులును ఘనంగా సన్మానిం చారు. గ్రామస్థులు, యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలకు నష్టం కలిగించవద్దు: జడ్పీ ఛైర్‌పర్సన్

**మొదటి పేజీ తరువాయి భాగం..**

కంపెనీ యాజమాన్యం పకడ్బందీగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. కంపెనీ ద్వారా లాభనష్టాలు ఉంటాయని అలాంటి వాటిపై చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత మీపై ఉందని వెంటనే అలాంటి చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. మరల వ్యర్థాలు బయటకు వస్తే ప్రజా ప్రతిఘటన ఎదురవుతుందని అలా రాకుండా ఇథనాల్ కంపెనీ యాజమాన్యం చూసుకోవాలని తెలిపారు. కంపెనీలోని పలు విభాగాలను తిరిగి ప్రొడక్షన్ మేనేజర్‌తో వివరాలు అడిగి తెలుసుకున్నారు. జడ్పీ ఛైర్మన్ వెంట చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# పరిహారమా.. పరిహాసమా..!

◆ రూ.2లక్షల పరిహారానికి భూ సేకరణ సాధ్యమేనా.? ◆ బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షులు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షులు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్27 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా వట్టెం రిజర్వాయర్ భూ నిర్వాసితుడైన అల్లాజీ కుటుంబానికి ఎకరాకు రూ.2లక్షల 4వేల పరిహారాన్ని నిర్ణయించడం దారుణమని, రూ.2 లక్షలకు ఎక్కడైన ఎకర పొలం దొరకడం సాధ్యమేనా అని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షులు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ బీఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై తీవ్రఅసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిధిలోని కుమ్మెర గ్రామంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన అల్లోజి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణానికి భూ సేకరణ అవసరమే కానీ వాటికి ఆర్భాటాలు చేసేందుకు భూమిని సేకరించడం న్యాయం కాదని, స్థానిక ఎమ్మెల్యే అధికారులు న్యాయ స్థానాన్ని కూడా మోసం చేశారని ఆరోపించారు. జంగయ్య కుటుంబానికి సంబంధించి 19 ఎకరాల వ్యవసాయ భూమి మొత్తం ముంపుకు గురి కావడం లేదని, క్యాంపుల ఏర్పాటుకు, ఇతర పనులకు భూములను ఉపయోగించడం వల్ల ఆ కుటుంబంలోని ఇద్దరు వ్యక్తులకు ఆత్మహత్య శరణ్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలోని పక్క వ్యవసాయ భూమికి రూ.10లక్షల పరిహారం చెల్లించి ఇతనికి తక్కువ చెల్లించడం వల్ల కోర్టును ఆశ్రయించారని, ఇక్కడి అధికారులు న్యాయ స్థానాన్ని కూడా మోసం చేసి ఎకరాకు రూ.2లక్షల పరిహారం తీర్పు ఇవ్వడం వల్లే ఈ సంఘటన చోటు చేసుకుందని, ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని ఆయన ఆరోపించారు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని,ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా తల్లోజు అంత్యక్రియలు దౌర్జన్యాలతో పూర్తి చేశారని, భూమి కేటాయించిన ధరపై స్థానిక ఎమ్మెల్యే స్పందించాలని, మృతదేహన్ని 3 రోజుల పాటు గ్రామంలో ఉంచిన జిల్లా అధికారులు, సాగు నీటి ప్రాజెక్టుల అధికారులు,అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం వారి చిత్తశుద్ధికే నిదర్శనమని ఆయన అన్నారు. ఇటీవల ఒక కుటుంబంలో మృతి చెందిన వారికి రూ.10లక్షల సహాయం చేస్తామని హామీ ఇచ్చి మంజూరు చేయలేదన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో రైతుల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. సంఘటన జరిగి 20 రోజులు గడుస్తున్న నేటి వరకు జిల్లా కలెక్టర్, అధికారులు బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోవడం కేసీఆర్ నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. ప్రాజెక్టు పరిధిలోకి రాని భూమిని అధికారులు ఎందుకు తీసుకున్నారని, ఇది కేసీఆర్ ప్రభుత్వం చేసిన రైతుల ఆత్మహత్యగా అభివర్ణించారు. రైతుల ఆత్మహత్యలకు కారణమైన కల్వకుంట్ల పాలనకు చరమగీతంపాడాలని, రూ.5లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి రాష్ట్రం వెళ్లిపోయిందని, నిధులు లేక నిలిచిపోయిన అమలుకానీ పథకాల పేరిటఆశ చూపి మరోసారి గద్దెనెక్కేందుకు దొర సిద్ధమయ్యారని,దీనిని తెలంగాణ ప్రజలు గమనించి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి మరోసారి మోసపోవద్దన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామన్నారు. స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డికి ఓటు అడిగే హక్కు లేదన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ముంపు రైతులకు నేటి వరకు నష్ట పరిహారం పూర్తిగా అందించలేదని మండిపడ్డారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి భూమిని సేకరించిన దళిత కుటుంబానికి చెందిన కాశన్నకు పరిహారం అందించలేదన్నారు. ఈ ప్రాంతంలోని దళితులకు, రైతులకు స్వేచ్ఛ లేదని, మెగా కృష్ణారెడ్డి స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిలకు మాత్రమే స్వేచ్ఛ ఉందన్నారు. ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి సేవ చేసేందుకురాజకీయాల్లోకిరాలేదని,దోచుకునేందుకు మాత్రమేరాజకీ యాల్లోకి వచ్చారనిఆయన ఆరోపించారు.రాబోవు రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వంపై తిరుగబడుతారని ఆయన జోస్యం చెప్పారు. సమావేశంలో తల్లోజు ఆచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుదిలీప్‌చారి, కొండమణెమ్మ, నాగేష్, సతీష్ మాదిగ, సుధాకర్‌రెడ్డి, రాజ వర్ధన్‌రెడ్డి, జానకి, అపర్ణరెడ్డి, రాధారెడ్డి, అందె బాబయ్య, శ్రీకాంత్ భీమా తదితరులు ఉన్నారు.

## సొంతగూటికి వార్డు మెంబర్ యాదయ్య

- చించోడ్ అభిమన్యురెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అభిమన్యురెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్27, ప్రభాతవార్త:** రాజాపూర్ మండలం చొక్కంపేట గ్రామానికి చెందిన 7వ వార్డు సభ్యుడు బత్తుల యాదయ్య కాంగ్రెస్ నుంచి తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గతంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన యాదయ్య బుధవారం ఎంపీటీసీ , యువ నేత చించోడ్ అభిమన్యు రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనతో పాటు గోపాల్‌గౌడ్ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీమోహన్‌నాయక్, అభిమన్యురెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.

## గణనాథునికి ఘన వీడ్కోలు

-గణేష్ మహారాజ్‌కు సాంస్కృతి సంప్రదాయాలతో భారీ ఊరేగింపు



గణనాథలు నిమజ్జన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పలువురు నాయకులు

**కల్వకుర్తి, సెప్టెంబర్27, ప్రభాతవార్త:** వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ప్రతిష్టించిన గణనాథులు 9 రోజుల పాటు విశేష పూజలందుకున్నారు. బుధవారం కల్వకుర్తి మున్సిపాలిటి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన పలు గణనాథుల నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఎర్ర కుంట మున్సిపాలిటిలో నిమజ్జనకార్యక్రమాన్ని చేపట్టారు. ఎర్రకుంటలో చేపట్టిన వినాయక నిమజ్జన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలంలు హజరై నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన కల్పించిన జడ్పీ సీఈఓ

**నారాయణపేట ప్రతినిధి, సెప్టెంబరు27 ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటర్‌గా ఓటు వేయాలని నారాయణపేట జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతి అన్నారు. బుధవారం నారాయణపేట ఆర్టీసి బస్సు డిపో ముందు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్టీసి కండక్టర్,డ్రైవర్లు వారి కుటుంబాలు ఇతర యువతీ, యువకులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసి డిపో మేనేజర్‌తో పాటు డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

## కుట్టుమిషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

**కొల్లాపూర్, సెప్టెంబరు27 ప్రభాతవార్త:** కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కొల్లాపూర్ నియోజకవర్గం కోడేరు, కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాలకు చెందిన 67 మంది మహిళ లబ్దిదారులకు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని మైనార్టీ కార్పోరేషన్ ద్వారా ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించి ఉన్నత స్థితిలోకి ఎదగాలని వృత్తి నైపుణ్యతను పెంచుకోవాలని, మహిళ సాధికారతను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్దిదారులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం రేపటి తరానికి ఆదర్శప్రాయం

-జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీధర్‌జీ



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించిన తహసీల్దార్

**నాగర్‌కర్నూల్ ప్రతనిధి, సెప్టెంబర్27 ప్రభాతవార్త:** కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా నాగర్‌కర్నూల్ సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయ ఆవరణలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయనకు ఘన నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ గర్వించే గొప్ప నేత అని ఆయన పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామిక వాదిగా, పీడిత ప్రజల పక్షపాతిగా, ఉద్యమకారుడిగా, నిబద్ధత కలిగిన గొప్ప రాజకీయ నాయకుడిగా ఆయన జీవితం రేపటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. తొలి తరం ఉద్యమ నాయకులు తెలంగాణ ఉద్యమంతో పాటు అనేక ఉద్యమాల్లో క్రియాశీలకంగా నిలిచిన బాపూజీ బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే పరమావధిగా తన జీవిత కాలం అంతా ప్రజల కోసమే పరితపించారని పలువురు అధికారులు పద్మశాలి సంఘం నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు లక్ష్మప్ప, వెంకటస్వామి, నాగర్‌కర్నూల్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు నిరంజన్, వనం సత్యం, చెన్న దుర ప్రసాద్, కార్యవర్గ సభ్యులు తాటికొండ అనిల్, ఉప్పల లక్ష్మయ్య, జగదీష్, దామోదర్, వర్గాలవిజయ్‌కుమార్, శ్రీరాములు, మాకం రామాంజనేయులు, కుమారస్వామి, రమేష్, జనార్ధన్, సురేష్ తదితరులు ఉన్నారు.

**గద్వాల ప్రతినిధి, సెప్టెంబరు27 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా పద్మశాలి సంఘం కన్వీనర్ కోట నరసింహులు, కో కన్వీనర్ శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో కృష్ణవేణి చౌక్‌లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొండా లక్ష్మణ్ బాపూజీని స్మరించుకుంటూ వారు చేసిన సేవలను కొనియాడారు. లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర సమరయోధుడు తెలంగాణ రాష్ట్ర తొలిదశ ఉద్యమంలో తనమంత్రి పదవిని తృణప్రాయంగా రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలో ఎంతో కీలక పాత్ర పోషించిన మహనుభావుడని అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామలింగేశ్వర కాంబ్లే, తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడం రామకృష్ణ, గద్వాల చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు చిన్న నాగరాజు, కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షుడు పోతు భీమేష్, నీలి శివరాములు, పగడాకుల సత్యం, నీలి నాగన్న, పులిపాటి శ్రీను, తిరుమల ఆంజనేయులు, పులిపాటి సుధాకర్, ఏరువా రాము, కడదాస్ నరసింహ, నీలిశేఖర్, తిరుమల, మునిపల్లి రఘు, భీమనపల్లి, వెంకటేష్, బావండ్ల వెంకటేష్, పోతు వీరేష్, కోట లక్ష్మణ్, కోటపోతు సాయిబాబా, శ్రీరామ్, పవన్, చిన్న నరసింహులు, బి. వీరన్న, సురెందర్, పులిపాటి జయరాములు పాల్గొన్నారు.

**ఇటిక్యాల, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కారకులు స్వాతంత్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు కృషి చేయాలని తహసిల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి తహసిల్దార్ వెంకటేశ్వర్లు, డిప్యూటి తహసిల్దార్ నందిని నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రశాంత్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్లు అనిత, శోభ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో:** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 18వ జయంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో బీఎస్పీ పార్టీ జిల్లా ఇంఛార్జి ఎంజి కృష్ణ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తొలిదశ, మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు తెలుగు నేలపై జరిగిన అనేక సామాజిక ఉద్యమాల్లో పాల్గొని క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, మధు,రాముడు, వెంకటేష్ పాల్గొన్నారు.

## మండల మనుగడ కొనసాగాలంటే వికారాబాద్ జిల్లాలో కలవాల్సిందే



మండలాన్ని వికారాబాద్ జిల్లాలో కలపాలని దీక్ష చేస్తున్న దృశ్యం

**గండీడ్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** మండలాన్ని వికారాబాద్ జిల్లాలో విలీనం చేయాలని వికారాబాద్ జిల్లా సాధన సమితి (జెఏసి) నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష తొమ్మిదవ రోజు సంఘీభావం తెలపడానికి బిజెపి రాష్ట్ర కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షులు పరిగి నియోజకవర్గ నాయకులు మారుతి,కిరణ్, బూనేటి, గండీడ్ మండల బిజెపి అధ్యక్షులు ప్రభు నాయక్, మహ్మదాబాద్ మండల బిజెపి అధ్యక్షులు కృష్ణ, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. మారుతి కిరణ్ బూనేటి సభకు సంఘీభావం తెలుపుతూ గండీడ్ మండలాన్ని వికారాబాద్ జిల్లాలో కలిపితేనే మనుగడ సాధ్యమవుతుందని, నిరుద్యోగుల భవిష్యత్తు బాగుపడుతుందని, మండలాన్ని వికారాబాద్ జిల్లాలో కలపడానికి అన్ని విధాలుగా తమ సహాయ సహకారాలుఉంటాయని హామీ ఇచ్చారు. వికారాబాద్ జిల్లా సాధన సమితితరపునమారుతి కిరణ్, బూనేటికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పేదలకు అండగా సీఎం సహాయనిధి



**బాలానగర్, సెప్టెంబరు27 ప్రభాతవార్త:** ఆపద కాలంలో పేద కుటుంబాలకు చెందిన బాధితుల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి ఎంతో అండగా నిలుస్తుందని బాలానగర్ వైస్ ఎంపిపి వడ్ల వెంకటచారి పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు బాలానగర్ గ్రామంలోని డ్రైవర్ వెంకటయ్య కుమారుడు శ్రీశైలం వారి అత్తమ్మకు రూ. 2,50,000 ఎల్ఓసి చెక్‌ను మాజీ మంత్రి జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చొరవతో వైస్ ఎంపిపి వెంకటచారి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. కార్యక్రమంలో బాలానగర్ మండల పార్టీ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌సాటి శ్రీనివాస్‌యాదవ్, ఏఎంసి డైరెక్టర్ నరసింహులు, బిఆర్ఎస్ గ్రామఅధ్యక్షుడురవికుమార్, మంగళశివ, రాజపురం నరసింహులు, ప్రేమ్‌కుమార్, మంగలి సూరి, మద్ది యాదయ్య పాల్గొన్నారు.

## కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:** వనపర్తి నియోజకవర్గంలో జరిగే పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు ఈ నెల 29న ఐటి శాఖ మంత్రి.కేటీఆర్ వస్తున్నారని, వనపర్తిలో జరిగే కేటీఆర్ సభను విజయవంతం చేయాలని వనపర్తి జిల్లా బిఆర్ ఎస్ నాయకులు, వక్ఫ్ ఆస్తుల రక్షణ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు షేక్ జహంగీర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి నియోజవకర్గాన్ని అన్ని రంగాల్లో మంత్రి.సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అభివృద్ధి పరుస్తున్నారని కొనియాడారు ఒకప్పుడు కరువు కాటకాలతో ఉండే ఉమ్మడి పాలమూరు నేడు పచ్చని పొలాలతో కళకళాడుతుందన్నారు. విద్యవర్తిగా విరాజిల్లిన వనపర్తి త్వరలో ఐటీ హబ్ గా మారనుందని, దీంతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రోడ్ల విస్తరణ పనులు చేపట్టడంతో వనపర్తి ఎంతో సుందరంగా తయారైందన్నారు. విద్యా కళాశాలలు తెచ్చిన ఘనత మంత్రి.నిరంజన్ రెడ్డి కే దక్కిందన్నారు. విద్యా కళాశాలలు మరింత అభివృద్ధి పరిచేందుకు వనపర్తికి వస్తున్న మంత్రి కేటీఆర్ సభను విజయవంతం చేయాలని కోరారు.

## ఆరోగ్య సమాజానికి మంచినీరే ప్రధానం

● తాగునీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి ● నేను సైతం సమాజం కోసం వ్యవస్థాపకులు, సామాజిక వేత్త షఫీ




మాట్లాడుతున్న నేను సైతం సమాజం కోసం వ్యవస్థాపకులు, సామాజిక వేత్త షఫీ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్27 ప్రభాతవార్త:** ఆరోగ్యకరమైన సమాజానికి మనం తాగే నీరే ప్రధాన భూమిక వహిస్తుందని, ప్రముఖ సామాజిక వేత్త, నేను సైతం సమాజం కోసం సంస్థ వ్యవస్థాపకులు షఫీ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మహమ్మద్ ఫక్రుద్దీన్ సారథ్యంలో జిల్లా సీపీఐ కార్యాలయంలో సమీపంలో ఏర్పాటు చేసిన ఏనాజిక్ ఇండిపెండెంట్ డిస్ట్రిబ్యూటర్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన మేరకు ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన ఎలాంటి రోగాలకు ఆస్కారం లేని నీటినే వాడాలని ఆయన సూచించారు. కేంగన్ నీటి శుద్ధి యంత్రం ద్వారా లభించే ఆరోగ్యకరమైన నీటి గురించి వివరిస్తూ ప్రజలకు తాగునీరు ఎలాంటిది వాడాలో అవగాహన కల్పించారు. మనిషికి వచ్చే జబ్బులు 70 శాతం మనం తాగే కలుషిత నీటి వల్లే వస్తాయన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే మనం తాగేనీరు ఎంత స్వచ్ఛంగా ఉండాలో ప్రజలకు అవగాహన కల్పించడానికి మహమ్మద్ ఫక్రుద్దీన్ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఏనాజిక్ గ్లోబల్ లీడర్ ప్రకాష్‌శాస్త్రీ, మున్సిపల్ చైర్మన్ కల్పన భాస్కర్‌గౌడ్, కౌన్సిలర్ సుమలత, లయన్స్‌క్లబ్ గవర్నర్ రాధాకృష్ణ, సుధాకర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకులు ఆనంద్‌జీ, జిల్లా కార్యదర్శి బాల్ నర్సింహ్మా, అబ్దుల్లా ఖాన్, సయ్యద్ రఫియొద్దిన్, కరుణ్ లాల్ తదితరులు ఉన్నారు.

## ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం



**దేవరకద్ర, సెప్టెంబరు27 ప్రభాతవార్త:** కౌకుంట్లలో బుధవారం బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్‌హాఖ్‌ను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన అబ్దుల్‌హాఖ్ బదిలీల ప్రక్రియలో గోపన్‌పల్లికి బదిలీ అయ్యారు.దీంతో కౌకుంట్ల పాఠశాలలో ఉపాధ్యాయుల అధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్‌హాఖ్ ఆత్మీయవీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో అబ్దుల్‌హాఖ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పురేందర్‌రెడ్డి, ఎమ్ఐఎస్ శ్రీనివాసులు, కౌకుంట్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధురి, బుచ్చారెడ్డి, శ్రీకాంత్, ఉపాధ్యాయులు, సీఆర్పీ నాగరాజు, పుట్టపల్లి సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరికలు



పార్టీలో చేరుతున్న వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి, సెప్టెంబర్27 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం ఎల్లికట్ట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఆర్ఎస్‌పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా పార్టీలు అవలంబిస్తున్న ధోరణి నచ్చకనే బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమం పట్టని కాంగ్రెస్ పార్టీలో మేము ఉండమని ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ కొండూర్ గోవర్ధన్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## వ్యక్తిగత ప్రమాద బీమా చెక్కు పంపిణీ

**పాగనల్, సెప్టెంబర్27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన ఒత్తిని నాగరాజు ఇటీవల ప్రమాద వశాత్తు చెరువులో పడి మృతి చెందాడు,కాగా మృతుడు ఇటీవల ఎస్బిఐ లో 500 రూ.వ్యక్తిగత భీమా చేయించాడు.మృతి చెందిన నాగరాజు భార్య శాంతమ్మకు ఎస్‌బిఐ నుండి మంజూరైన 10 లక్షల రూపాయల చెక్కును.అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వెంకటనారాయణ సిఎస్ఎం వెంకట లక్ష్మణ్ మేనేజర్ నాగరాజు మేనేజర్ చీఫ్ మేనేజర్ వనపర్తి నాగ ప్రకాష్ ఏరియా మేనేజర్ భరత్ కుమార్ లు మృతుని భార్య నామినికి అందజేశారు.

## జడ్చర్ల నుంచి బోయలకుంటకు రోడ్డు మంజూరు

- రూ.1.20కోట్ల నిధులు విడుదలపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి సన్మానం

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:** జడ్చర్ల నుంచి బోయలకుంటకు రోడ్డు మంజూరు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులకు రూ.1.20కోట్ల నిధులు విడుదల చేయడంపై బుధవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సన్మానించారు. ఈమేరకు జడ్చర్లలోని ఎమ్మెల్యే నివాసంలో బోయలకుంటవాసులు మహిళలు, యువకులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఎన్నో ఏండ్ల కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలోనే రహదారుల కనెక్టివిటీ పెరిగిందన్నారు. గ్రామాల నుంచి మండలాలకు రహదారుల సౌకర్యం మెరుగైందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డుకు వందశాతం డ్రైనేజీలు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి వసతి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ రమేశ్, బాలరాజు, రవి, సత్యం, మల్లేశ్, అంజిబాబు, జంగయ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న బోయలకుంటవాసులు

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



**శ్రీరంగాపురం మండలం, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:** ఈ నెల సెప్టెంబర్ 5వ తేదినా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వనపర్తి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న తాటిపాముల యూపీస్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నా రామచంద్రయ్య ను బుధవారం తాటిపాముల పాఠశాలలో గ్రామ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ బృందం, పాఠశాల యాజమాన్య కమిటీచే జ్ఞాపిక, పూలమాలవేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ..వృత్తి పట్ల ఆయనకున్న నిబద్ధత, సమయపాలన, వినూత్న బోధనా విధానం, చక్కని పరిపాలననే ఆయన్ను ఈ అవార్డు అందుకునేలా చేశాయని, తమ గ్రామ ఖ్యాతిని జిల్లా స్థాయికి విస్తరించిన ఆయనకు శుభాభివందనాలు తెలుపుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పురస్కారాలు స్వీకరించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్యనారాయణ యాదవ్, ఎంపీటీసీ పార్వతమ్మ వెంకటయ్య నాయుడు, ఉప సర్పంచ్ కురుమన్న, పెబ్బేరు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు శేఖర్ రెడ్డి, రేణుక, మాధవి లత, వసంతపురం రాజు, రవి, శివ శంకర్ యాదవ్, చిన్న రాములు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రెండవ ఏఎన్ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

**ఇటిక్యాల, సెప్టెంబరు27 ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా వైద్యారోగ్య శాఖలో 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్దతిలో పని చేస్తున్న రెండవ ఎఎన్ఎంలకు ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేదంటే వచ్చేనెల అక్టోబర్ 5వ తేదీ నుండి మరోసారి సమ్మెకు దిగుతామని రెండవ ఎఎన్ఎంలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో తహసిల్దార్ వెంకటేశ్వర్లు, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి డా. రమేష్‌కు వచ్చేనెల 5 నుండి చేపట్టే సమ్మె నోటీసులు అందజేశారు. అయితే గత నెల 16 నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు వివిధ రూపాలలో రెండవ ఎఎన్ఎంల అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మెను కొనసాగించారు. ప్రభుత్వం ఒక మెట్టుదిగివచ్చి రెండవ ఎఎన్ఎంల సమస్యల పరిష్కారం కోసం వారి డిమాండ్లను పరిష్కరించేందుకు ముగ్గురు అధికారులతో కూడినకమిటిని ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో రెండవ ఎఎన్ఎంలు విద్యావతి, మహేశ్వరి, ఎలిజబెత్, విశ్వనాథమ్మ పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

**కల్వకుర్తి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కల్వకుర్తి ఆర్డీఓ కార్యాలయం ముందు కల్వకుర్తి, వంగరు మండలాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్డీఓకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఏళ్ల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తుందని ఆశతో సర్కార్ పాఠశాలల్లో పనిచేస్తున్నారని, వారికి వెయ్యి రూపాయల గౌరవ వేతనం ఇస్తూ మెను బిల్లుల నెలల తరబడి కొందరికి సంవత్సరం నుంచి రాకపోవడంతో సొమ్ములు కుదవబెట్టి అప్పులు చేసి మధ్యాహ్న భోజన ఏజెన్సీ నడిపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలస్వామి,కార్మికులు శాంతమ్మ,అనురాధ, యాదమ్మ, కళమ్మ, మణెమ్మ, అలివేలు తదితరులు ఉన్నారు.

## ఈవీఎం వీవీప్యాడ్ అవగాహన కార్యక్రమం



**కల్వకుర్తి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆదేశానుసారం కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఈవీఎం వీవీ ప్యాడ్‌లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సి పల్ చైర్మన్ ఎడ్మ సత్యంకు ఈవీఎం వీవీ ప్యాడ్ విధానాన్ని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, కౌన్సిలర్ బోజిరెడ్డి, సైదులుగౌడ్, గోరటి శ్రీనివాస్, నాయకులు నూనె శ్రీనివాస్, బావండ్ల మధు,రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాస గౌడ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మెప్మా, ఆర్పీలకు వేతనాలు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా, ఆర్పీలు ఎమ్మెల్యేను కలిసి వారికి పుష్పగుచ్చం అందించి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ మున్సిపల్‌లో పనిచేస్తున్న ఆర్పీలను గుర్తించి వేతనాలు పెంచడం పట్ల సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, కౌన్సిలర్లు బోజిరెడ్డి, సైదులుగౌడ్, గోరటి శ్రీనివాస్, నాయకులు బావండ్ల మధు, నూనె శ్రీనివాస్, కార్వంగ శ్రీనివాస్, జంబులు, టీఎల్ఎఫ్ అధ్యక్షులు మహమూదాబేగం, ఆర్పీలు ఉన్నారు.

## నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా మాచిపెద్ది అశోక్ ఎన్నిక



ఉత్సవ కమిటీ అధ్యక్షులు మాచిపెద్ది అశోక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, సెప్టెంబర్27, ప్రభాతవార్త:** శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దసరా పర్వదిన వేడుకలను పురస్కరించుకొని నిర్వహించే దేవీశరన్నవరాత్రోత్సవాలకు ఉత్సవ కమిటీ ఎన్నికను ఆలయ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబు అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మాచిపెద్ది అశోక్‌తో పాటు మరి కొంత మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడితో పాటు కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభజిల్లాఅధ్యక్షులు బచ్చు రామకృష్ణ,, ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, కోశాధికారి శివ్వ జగదీశ్వర్, అదనపు కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, పాపిశెట్ట శ్రీనివాసులు, కంది ప్రవీణ్, సంబురమణ,గంప శ్రీనివాస్, గంధం ప్రసాద్, వీరేష్, కొండూర్ కృష్ణయ్య, గుబ్బ ప్రభాకర్, ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంస్థలు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికి దళితబంధు, గృహలక్ష్మి పథకం అమలు చేయాలి



**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్27,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలోని సంగినేనిపల్లి గ్రామంలో వీపనగండ్ల మండల సిపిఎం పార్టీ కమిటీ సమావేశం సంగినేని పల్లి గ్రామంలో సర్పంచు ఆర్ మౌలాలి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి డి.బాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న దళితబంధు, గృహలక్ష్మి పథకాలు అర్హులైన ప్రతి లబ్దిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేసి ఇవ్వాలని వారు డిమాండు చేశారు. అదే విధంగా బిఆర్ఎస్ ప్రభుత్వం ఏకకాలంలో రుణమాఫీ చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. రుణమాఫీ చేసిన రైతులకు వడ్డీలు అదనపు భారంగా తయారయిందని వారన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.కృష్ణయ్య, మహబూబ్ పాషా, మురళి, మండల కమిటీ సభ్యులు సర్పంచు ఆర్.మౌలాలి, రామచంద్రయ్యగౌడ్, బాలగౌడ్, వీ.కృష్ణయ్య, ఆశన్న, ఖాజా హుస్సేన్, రవిప్రసాద్, నిరంజన్ తదితరులు ఉన్నారు.

## గోపన్‌పల్లిలో వినాయకుడికి డీసీసీ అధ్యక్షుడి పూజలు

**దేవరకద్ర, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గోపన్‌పల్లిలో బుధవారం వినాయకుడికి డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూధన్‌రెడ్డి పూజలు నిర్వహించారు.అంజనేయస్వామి దేవస్థానం వద్ద ప్రతిష్టించిన వినాయకుడి మండపంలో మధుసూధన్‌రెడ్డి ఈ పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కుమ్మరి రాంబాబు ,వరుణ్‌కుమార్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, అక్షయరెడ్డి,వినోద్‌రెడ్డి తదితర గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధన కోసం కృషి చేయాలి

**● వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్**



లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్27,ప్రభాతవార్త:** కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధన కోసం తెలంగాణలోని ప్రతి పౌరుడు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి వేడుకలను బుధవారం ఉదయం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు, పద్మశాలి సంఘం నాయకులు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాధన కోరకు పోరాటం చేసిన మహనీయులను తెలంగాణ సమాజం ఎల్లప్పుడూ స్మరించుకుంటూ వారు చూపిన అడుగుజాడల్లో నడుస్తుంది. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం సభ్యులు నీలి నారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తొలి, మలి విడత ఉద్యమంలో కొండా లక్ష్మణ్ నిస్వార్ధంగా పోరాటం చేశారాన్నరు. తెలంగాణ ఉద్యమం కొరకు తన స్వంత ఇంటిని కార్యకర్తల సమావేశం కొరకు కేటాయించిన నిస్వేతపరుడ ని కొనియాడారు. తెలంగాణ ఆదర్శమూర్తి అయిన కొండా లక్ష్మణ్ బాపుకు వనపర్తి జిల్లాలో విగ్రహస్థపనకు సహకరించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖాధికారి బి.సుబ్బారెడ్డి, జిల్లా అధికారులు, రజక సంఘం జిల్లా అధ్యక్షులు విజయ్, కోశాధికారి పాపన్న, గౌరవ సలహదారులు సత్యనారాయణ,రాములు,బాలస్వామి,శ్రీనివాసులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, సెప్టెంబర్27,ప్రభాతవార్త:** స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ తొలి దశ ఉద్యమంలో మంత్రి పదవిని త్యజించి తెలంగాణ వచ్చే వరకు ఎలాంటి పదవులను చేపట్టనని శపథం చేసి చివరి వరకు అలాగే ఉండి మలిదశ ఉద్యమంలో కీలక భూమిక పోషించి తన జీవితాంతం ప్రజల కోసమే అర్పితం చేసి పోరాటం చేసిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బృంగి ఆనంద్‌కుమార్‌లు అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బృంగి ఆనందకుమార్‌లు, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అధ్యక్షతన కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలి ఉద్యమాల్లో, బహుజన ఉద్యమంలో పాల్గొన్న ఏకైక వ్యక్తి అని, అతను సూచించిన మార్గంలో యువత ముందుకు నడవాలన్నారు. ఆత్మ గౌరవం కోసం,రాజ్యాధికారంలో సమాన వాటా కోసం నిరంతరం ఉద్యమించాలని, చదువును నిర్లక్ష్యం చేయకుండా ఉన్నత చదువులు చదివి మహోన్నత వ్యక్తులుగా ఎదగాలన్నారు. అదే విధంగా పద్మశాలి భవన్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పద్మశాలీ సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, కౌన్సిలర్లు బోజిరెడ్డి, సైదులుగౌడ్, గోరటి శ్రీనివాస్, నాయకులు బావండ్ల మధు,నూనె శ్రీనివాస్,రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కిశోర్‌రెడి , బీసీ సబ్‌ప్లాన్‌సాధన కమిటీఅధ్యక్షులు రాజేందర్, గోపాల్, సాయిలు, దుర్గప్రసాద్, రవిగౌడ్, శేఖర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# తప్పులులేని జాబితా రూపొందించాలి

**● ఓటరు జాబితా పరిశీలకురాలు భారతి లక్పతినాయక్**



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకురాలు భారతి లక్పతి నాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** ఎలాంటి తప్పులు లేని పారదర్శక ఓటరు జాబితాయే లక్ష్యంగా రూపొందించాలని మహబూబ్‌నగర్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు, రాష్ట్ర పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ స్పెషల్ సెక్రెటరీ భారతి లక్పతి నాయక్ అన్నారు. బుధవారం ఆమె ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో సమావేశమై ఆయా మండలాల వారిగా ఓటరు జాబితా సవరణ సందర్భంగా వచ్చిన దరఖాస్తులు, ఫిర్యాదులు, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. ముఖ్యంగా ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్ల తొలగింపులో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మరణ ధృవీకరణ పత్రం ఆధారంగా చనిపోయినవారి పేర్లను తొలగించాలని చెప్పారు. అదేవిధంగా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే వారి విషయంలో ఆధార్, ఇతర ధృవపత్రాల ఆధారంగా ఓటరు జాబితాలో నమోదు చేయాలని అన్నారు. ఓటరు జాబితాలో సవరణకై వచ్చిన అభ్యంతరాలను 27వ తేదీలోగా పరిష్కరించాలని చెప్పారు.అనంతరం ఆమె మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మహబూబ్‌నగర్‌జిల్లా కేంద్రంలో వన్‌టౌన్‌లో ఉన్న గాంధీరోడ్ ఉన్నత పాఠశాలలో,ఉర్దూ మీడియంపాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ బిఎల్‌ఓలు ఓటరు జాబితా సవరణకు తీసుకున్న చర్యలను పరిశీలించారు. దేవరకద్ర నియోజకవర్గంలో బసవాయిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో బూతుస్థాయి అధికారులతో ఓటరు జాబితా సవరణ దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ పరిష్కారం పరిశీలించారు. జడ్చర్లలో కావేరమ్మపేట పాఠశాల పోలింగ్ కేంద్రానికి వెళ్లి అక్కడ ఓటరు జాబితా పరిశీలన సవరణకు వచ్చిన దరఖాస్తులు పరిశీలించారు. సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణకు సంబంధించి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన చర్యలపై ఓటరు జాబితా పరిశీలకురాలుకు వివరించారు. జిల్లాఎస్పీ కె.నరసింహా, రెవెన్యూ అదనపు కలెక్టర్, జడ్చర్ల సీఆర్‌ఓ ఎస్.మోహన్‌రావు,మహబూబ్‌నగర్ ఈఆర్‌ఓ అనిల్‌కుమార్, దేవరకద్రఈఆర్‌ఓ స్పెషల్ డిప్యూటి కలెక్టర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శిలాఫలకం ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు



ధ్వంసమైన శిలాపలకాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**వెల్దండ, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని భైరాపూర్ గ్రామ సమీపంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వంతెన ఏర్పాటు చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రారంభ శంకుస్థాపన శిలాఫలకాన్ని బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని గ్రామ సర్పంచ్ దార్లకుమార్ ఎస్ఐ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దార్లకుమార్ మాట్లాడుతూ ఈ నెల 20న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌అధికారికంగా బ్రిడ్జి పనులకు రూ.3కోట్ల 50లక్షలతో ప్రారంభిస్తూ శంకుస్థాపన శిలా పలకాన్ని ప్రారంభించారు. గుర్తు తెలియని వ్యక్తులు కుట్ర పూరితంగా రాజకీయ కక్ష్యతో ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ శ్రీనివాసులు ధ్వంసమైన శిలాఫలకాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

## భక్తి ద్వారానే ముక్తి లభిస్తోంది

-ఐక్యత పౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



**వెల్దండ, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** భక్తి ద్వారానే ముక్తి లభిస్తోందని, ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలని ఐక్యత పౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండల పరిధిలోని గానుగట్టుతాండలో ప్రతిష్టించిన వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలను సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్ని భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తరుణ్, లాలునాయక్, రామచంద్రయ్య, రాజు, రమేష్, భీముడు, నర్య, పంతులనాయక్, లాలునాయక్, లోక్య, నర్సింగ్, రాజు, జయరాం, ఆంజనేయులుతో పాటు తదితరులు ఉన్నారు.

## మన్యంకొండ హుండీ ఆదాయం లెక్కింపు

**దేవరకద్ర,సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయం 27లక్షల12వేల489 రూపాయల ఆదాయం వచ్చింది.దేవస్థానం హుండీని బుధవారం లెక్కించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అలహరి రాయకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు,ఇన్స్‌పెక్టర్ వీణాధరణి,పాలకమండలి సభ్యులు రాజేందర్‌రెడ్డి, శ్రీనివాసులు,సువర్ణ,అపర్ణ,లక్ష్మీదేవి,మంజుల,మహాలక్ష్మీ,లతో పాటు రామచంద్రాపూర్ ఏపిజివిబి బ్యాంకు మేనేజర్ ప్రసాద్, చెన్నకేశవులు, నందకిశోర్, రమ్యసాయి,సేవామహిళా సభ్యులు,దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య**

**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు27 ప్రభాతవార్త:** తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక జడ్చర్ల డా.బిఆర్ అంబేద్కర్ కాలనీలో నిరవధిక సమ్మె మూడో రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా బుధవారం జడ్చర్ల మండల కేంద్రంలో బిఆర్ అంబేద్కర్ చౌరస్తా నుండి కావేరమ్మపేట పిహెచ్‌సి సెంటర్ వరకు ర్యాలీగా బయలుదేరి పిహెచ్‌సి సెంటర్‌లో రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి, సత్తయ్య భాగీ కృష్ణయ్య మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో కెసిఆర్ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, గౌరవ వేతనంతో వెటిన చాకిరి చేయించుకుంటున్నారని, అధికారుల వేధింపులు ఆపాలని కోరారు.అర్హులైన వారిని గుర్తించి రెండవ ఎఎన్ఎంగా అందించాలని వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివలీల, నర్సమ్మ, శ్రీదేవి, లలిత, సుగుణ, నజీమా, పద్మ, సుజాత, జయలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**గద్వాల ప్రతినిధి,సెప్టెంబరు27 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల టౌన్‌లోని వివిధ వార్డులకు చెందిన సంబంధించిన లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే చైర్మన్ చేతుల మీదుగా 119 మంది లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబురామన్‌గౌడ్, వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు లక్ష్మి, మురళి, నాగిరెడ్డి, శ్రీను, నరహరిగౌడ్, మహేష్, దౌలు, కృష్ణ, శ్రీమన్నారాయణ, నాగరాజు, కో ఆప్షన్ మెంబర్, గద్వాల పట్టణ అధ్యక్షులు గోవిందు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకటరాములు, రమేష్‌నాయుడు, కోడిగుడ్ల సలాం, కోటేష్, నాగులు యాదవ్, రామకృష్ణశెట్టి, రంజిత్, జనార్ధన్‌రెడ్డి, రిజ్వాన్, కుమ్మరి రాము, ధర్మనాయుడు, మోబిన్, మధు, గంట రమేష్,పవన్‌యాదవ్,ఫయాజ్,వీరేష్, వెంకటేష్, పరశురాముడు, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు వైద్య సేవలను వినియోగించుకోవాలి

**జిల్లా వైద్యాధికారి కె. సుధాకర్‌లాల్**



**లింగాల,సెప్టెంబరు27ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారులు చేస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలోని పలు రకాల రికార్డులను పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో డెంగ్యూ వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయని వాటి నివార ణకు సంబంధించిన శాఖ అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాలని కోరారు. అంతకు ముందు సరైన వైద్యం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూవ్యాప్తి చెందుతున్న గ్రామాల్లో గ్రామ పంచాయతీ సిబ్బందిచే గ్రామ పంచాయతీ అధికారులు, శానిటేషన్ చేయించాలని ఆ శాఖ అధికారులతో మాట్లాడారు. ఆసుపత్రిలో చేస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట వైద్యాధికారులు శివ శంకర్, ప్రశాంత్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## గంగమ్మ ఒడికి గణనాథులు

**- మహబూబ్‌నగర్‌లో ఘనంగా నిమజ్జనోత్సవం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్27, ప్రభాతవార్త:** తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజలందుకున్న గణేశుడు బుధవారం నిమజ్జనానికి తరలారు. దీంతో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జడ్చర్ల మున్సిపాలిటీలో కోలాహలం నెలకొన్నది. ఈసందర్భంగా గురువారం తెల్లవారుజాము వరకు అంగరంగ వైభవంగా నిమజ్జనోత్సవం నిర్వహించారు. పలు కాలనీల్లో నిర్వహించిన శోభాయాత్రలో కాలనీ మహిళలందరూ కలిసి పాల్గొని ఆటపాటతో అందరినీ అలరించారు. మహబూబ్‌నగర్‌లో రహదారుల పొడవునా గణపతి బప్పా మోరియా అంటూ హోరెత్తించారు. యువకులు, మహిళలు ఆనందోత్సాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. యువకులు డీజే సౌండ్స్‌తో పెద్ద ఎత్తున నృత్యాలు చేస్తూ నిమజ్జనానికి తరలించారు. పలుచోట్ల చిన్నారులు ఉట్టికొట్టి సందడి చేశారు. డప్పు వాయిద్యాలు, పటాకుల మోతల నడుమ అత్యంత వైభవంగా గణనాథులను గంగమ్మ ఒడికి తరలించారు. ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ క్లాక్ టవర్ వద్ద నిమజ్జనానికి తరలుతున్న వినాయకుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. నృత్యం చేసి యువకులను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవినాయక్ ఆదేశాల మేరకు ఎస్పీ నరసింహ, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ నరసింహ భారీ బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు27 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహాలకు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జడ్చర్ల పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బిసిసేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణయాదవ్ మాట్లాడుతూస్వాతంత్ర్య సమరయోధుడు,నైజాం వ్యతిరేక పోరాట యోధుడు, మూడు తరాల ప్రత్యేక తెలంగాణ ఉద్యమ శిఖరం కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఆయన సేవలను కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ప్రకటించేలా కేంద్రంపై రాష్ట్రపతి తేవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, సిఐటియు జిల్లా నాయకులు బొల్లెమోని నిరంజన్, సురభి విజయ్‌కుమార్, కుర్వగడ్డపల్లి గోపాల్, గొడుగు నరసింహులు, గోనెల రాధాకృష్ణ, పోలేపల్లి రాఘవేందర్, నాగసాయిలు, మహేష్, మల్లెబోయిన్‌పల్లి గోపాల్ పాల్గొన్నారు.

**బిసి సమాజ్ ఆధ్వర్యంలో:** మహబూబ్‌నగర్ బిసి సమాజ్ ఆఫీస్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ ఎం. శ్రీనివాస్‌సాగర్ మాట్లా దుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణవిముక్తి కోసం ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్‌నటరాజ్, ఉమ్మడిమహబూబ్‌నగర్ కో కన్వీనర్ సవారి సత్యం, కుమ్మరి సంఘం అద్యక్షుడుబుగ్గన, సభ్యుడురవి,రజకసంఘం అధ్యక్షులు పురుషోత్తం, ముదిరాజ్ సంఘంసీనియర్‌నాయకులు ఆశన్న ముదిరాజ్, బుదురు శేఖర్,నాయిబ్రాహ్మణ సంఘంనాయకులు మార్కె ట్ కమిటి డైరెక్టర్ కృష్ణయ్య, వడ్డెర సంఘం అధ్యక్షులు చంద్రయ్య, నాయిబ్రాహ్మణ జిల్లా సీనియర్ నాయకులు ఎంవి రమణ పాల్గొన్నారు.

## పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేస్తాం : కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి,సెప్టెంబరు27 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసి పర్యాటకులు వచ్చేలా చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన ద్వితీయ బహుమతులు సాధించిన విద్యార్థినిలు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మెమెంటోలు అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో లిచత, మీనాక్షి, మధుప్రియ, సురేఖ, జోయ ఆనం,నిదామహీన్, నూర్జహాన్, దిల్‌శాగుప్త ఉన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓరామచందర్,అధికారులుసిపిఓ, డిడబ్ల్యుఓ,డిబిసిడిఓ కృష్ణమాచారి,పర్యాటకశాఖఅధికారి రషీద్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## మేరి మట్టి మేరా దేశ్

**నారాయణపేట ప్రతినిధి,సెప్టెంబరు27 ప్రభాతవార్త:** మేరి మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మక్తల్ పట్టణంలో స్వాతంత్ర్య సైనిక అమరవీరులు సమరయోధులు నివసించిన గృహాలను సందర్శించి ఆయా ఇళ్లల్లో నుండి సరైన విధానంతో మట్టిని సేకరించారు. దేశమంతటా ఇలా సేకరించిన మట్టితో ఢిల్లీలో స్వాతంత్ర్య సైనిక అమరవీరుల స్తూపం నిర్మించడం దీని ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పోస్టర్ సూపరింటెండెంట్ ఎంఎ అలీమ్‌తోపాటు సబ్ డివిజన్ ఐపిఓ రవికుమార్, విద్యాసాగర్, మక్తల్ పోస్టుమాస్టర్ మిఠాయి రాజేష్, సబ్ ఆఫీస్ పరిధిలోని బిపిఎంలు, ఎబిపిఎంలు గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**గద్వాల ప్రతినిధి,సెప్టెంబరు27 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం కెటిదొడ్డి మండల తాజా, మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతయ్య, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి పార్టీ గద్వాల పట్టణ 5వ వార్డు కౌన్సిలర్ శారద సురేష్, కెటిదొడ్డి మండల అధ్యక్షుడు కొండాపురం సర్పంచ్ మహానందిరెడ్డి, ధరూర్ మండల మాజీఎంపిపి కుమారుడు తిమ్మారెడ్డి, జమ్మిచెడు కో ఆప్షన్ మెంబర్ మరియమ్మ, తిమోతి, కొండాపురం మాజీ సర్పంచ్ భీమిరెడ్డి, కొండాపురం మాజీఎంపిటిసి పద్మారెడ్డి, గద్వాల మండల ముల్కలపల్లి ఎంపిటిసి అయ్యన్న,సర్పంచ్ గీత,ఉపసర్పంచ్ జగదీష గౌడ్,మాజీ ఉపసర్పంచ్ జమ్మన్న, మాజీ ఎంపిటిసి నాగరాజు, ఎకె వెంకటన్న, గుంతబాయి శ్రీనివాసులు, వెంకటాపురం మురళి, ఎం. పద్మారెడ్డి, కెటిదొడ్డి, వైస్ ప్రెసిడెంట్ పాపిరెడ్డి, తిరుపతి, జంగిలప్ప, మద్దూరు యూనియన్ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, శాంసుందర్, మల్లేష్, మహదేవ్, వార్డు మెంబర్లు బజరన్న, కృష్ణ, రాముడు, చిన్న మహబూబ్, వాల్మీకి నాయకులు మద్దిలేటి, వెంకటాద్రి, మున్నెన్న, వంటల రాముడు, డబ్బా లక్ష్మణ, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, ఈశ్వర్, నరసింహులు, ఆలయ కమిటి మాజీ చైర్మన్ ఆంజనేయులు, రంగన్న, వెంకటస్వామి, విద్యాకమిటి చైర్మన్ యాదగిరి, పరశు, అయ్యప్ప, నాగరాజు, కోళ నరసింహ, దేవన్న, శివ, కృష్ణ, సుందర్‌రాజు, సంపత్, రాముడు, సంజీవులు, యుగేంద్ర, వడ్డెపాండు, చిన్నస్వామి, పెద్దస్వామి,గుర్రం రాము, కావలి నరసింహులు, వడ్డె నరసింహ, బోయ వీరేష్,గుడిసె రంగస్వామి,కావలిరంగస్వామి, ప్రధాన నాయకులు దాదాపు 200ల మంది టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని బిఆర్ఎస్, బిజెపిపార్టీల నుంచి గద్వాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ చేరిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుదన్నారు. గద్వాల గడ్డపై బడుగు బలహీన వర్గాల ఆడబిడ్డ సరితను కాంగ్రెస్ పార్టీ తరపున గెలిపించి శాసనసభకు పంపాలనిపార్టీలో చేరిన నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## భరోసా కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా అదనపు ఎస్పీ

**గద్వాల ప్రతినిధి,సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** నిర్మాణంలో ఉన్న భరోసా కేంద్రానికి సంబంధించి మిగిలిన పనులను నవంబర్ 15 తేదినాటికి పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.రవి భరోసా భవన ఇంజనీర్‌ను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని భీంనగర్‌లో మెయిల్ కంపెనీ సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న భరోసా కేంద్రాన్ని అదనపు ఎస్పీ సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఇంకా పూర్తి చేయాల్సిన పనులు తదితర వివరాలను మెయిల్ కంపెనీ అధికారి జిల్లా అదనపు ఎస్పీకి వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంట సాయుధ దళ డీఎస్పీ ఇమ్మానియేల్, ఎస్సై రమాదేవి, భరోసా కో ఆర్డినేటర్ శివాని, ఇంజనీర్ పుష్కర్ ఉన్నారు.